క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగ చోరీ

నెల్లూరు సిటీ: ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు నెల్లూరు రూరల్ పోలీసులకు రైతులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వేసవి సెలవుల్లో ఆటల నిమిత్తం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియానికి వస్తున్న చిన్నారులకు పౌష్టికాహారాన్ని స్మైల్, వివేకానంద, ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో అందజేశారు. వీటిని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ శుక్రవారం పంపిణీ చేశారు. దాతలను ఆయన అభినందించారు.

మలేరియా ప్రబలకుండా చర్యలు



పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): మలేరియా కేసులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని మలేరియా నివారణ విభాగ సహాయాధికారి నాగార్జునరావు సూచించారు. కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని రామిరెడ్డి వారి వీధిలో ఓ వ్యక్తికి మలేరియా సోకడంతో ఆ ప్రాంతాన్ని మలేరియా నివారణ విభాగాధికారులు పరిశీలించారు. ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతాల ప్రజలు నీటిని నిల్వ చేసుకున్న డ్రమ్ములు, బిందెలు, ఇతర పాత్రలను పరిశీలించారు. నిల్వ ఉంచిన నీటిలో దోమ లార్వాలున్నాయనే అంశాన్ని గుర్తించారు. అనంతరం మలాథియాన్‌ను స్ప్రే చేశారు. ఫీవర్ సర్వే చేపట్టారు. ఎస్‌యూఏ శ్యామ్‌సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో ఆటో కార్మికుల చేరిక



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన 40 మంది ఆటో కార్మికులు సీపీఐ అనుబంధ ఏఐటీయూసీలో శుక్రవారం చేరారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏఐటీయూసీ నూతన ఆటో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మధు, అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రసాద్, సునీల్, ఉపాధ్యక్షుడిగా రెహ్మాన్, ట్రెజరర్‌గా అంజయ్య, ఈసీ మెంబర్లుగా కొండయ్య, మునీష్, వెంకటేష్ ఎన్నికయ్యారు. నేతలు సిరాజ్, శంకర్ కిశోర్, షానవాజ్, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు



మాట్లాడుతున్న కృష్ణకాంత్

• ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని.. విలువలతో కూడిన విద్య పిల్లల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో 111 మంది పోలీసుల పిల్లలకు కౌన్సెలింగ్‌ను శుక్రవారం నిర్వహించి, 11 కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత, రాయితీ అడ్మిషన్లను కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు. పోలీసుల పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ముందుకొచ్చిన విద్యాసంస్థల యాజమాన్యాలకు కృతజ్ఞతలను తెలియజేశారు. ఏఎస్పీ సౌజన్య, ఏఓ చంద్రమౌళి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐలు రాజారావు, అంకమరావు, పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనంలో అవకతవకలపై చర్యలకు వినతి



డీఈఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రి పదవికి లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఫీజును వసూలు చేయకుండానే ప్రతి విద్యార్థి జవాబుపత్రాలను మరోసారి మూల్యాంకనం చేయాలని కోరారు. విద్యార్థి విభాగ నెల్లూరు రూరల్, కావలి, సర్వేపల్లి, సూళ్లూరుపేట అధ్యక్షులు రోహిత్‌రెడ్డి, శ్యామ్, హేమంత్, తేజ తదితరులు పాల్గొన్నారు.

• ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫారాలను విక్రయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సరైన భవనాల్లేకుండానే అడ్మిషన్లను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కార్తీక్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

• ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సునీల్, షారూఖ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆశీర్వాదం, హర్ష, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బుజ్జమ్మరేవులో కార్డన్ సెర్చ్



అనుమానితుల వేలిముద్రలను సేకరిస్తున్న పోలీసులు



ఇళ్లలో తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో సంతపేటలోని బుజ్జమ్మరేవులో కార్డన్ సెర్చ్‌ను స్థానిక పోలీసులు శుక్రవారం నిర్వహించారు. నగర డీఎస్పీ సింధుప్రియ పర్యవేక్షణలో సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు తన సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బుజ్జమ్మరేవులోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాల్లేని 31 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమానితుల వేలిముద్రలను సేకరించారు. ఇద్దరు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడారు. కార్డన్ సెర్చ్‌లకు ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మత్తు, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు తదితరాలపై డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్సైలు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా లక్షమల్లెలార్చన



నెల్లూరు(బృందావనం): రామ్‌నగర్‌లోని చతుర్భుజి మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారికి లక్ష మల్లెపూలతో అర్చనను శుక్రవారం నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువైన అమ్మవారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అన్నప్రసాదాన్ని అందజేశారు. లక్ష్మీకుమారి, సాయిభార్గవి, బాలాజీ, లక్ష్మణరావు తదితరులు పర్యవేక్షించారు.

ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శిగా చక్రవర్తి



నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన చక్రవర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. చక్రవర్తికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రామ్ ప్రసాద్ అభినందనలను తెలియజేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

నెల్లూరు సిటీ / నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) / నెల్లూరు(బారకాసు) / నెల్లూరు(క్రైమ్): త్యాగానికి ప్రతీక బక్రీద్ అని పలువురు పేర్కొన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లింలకు పండగ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ నగర ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, ఎస్పీ కృష్ణకాంత్ వేర్వేరు ప్రకటనలను శుక్రవారం విడుదల చేశారు.

పీఎంజే జ్యువెల్స్ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద పీఎంజే జ్యువెల్స్ నూతన స్టోర్‌ను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ప్రారంభించారు. జ్యువెల్స్ ఆంధ్రా బిజినెస్ హెడ్ హైదర్ అలీ, క్లస్టర్ మేనేజర్ అరవింద్‌కుమార్, నెల్లూరు స్టోర్ హెడ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల స్వాధీనానికి వినతి

నెల్లూరు రూరల్: గుడ్లూరు మండలంలోని సర్వే నంబర్ 879లో రామదూత ఆక్రమించిన చెరువు పోరంబోకు.. సర్వే నంబర్ 883లోని అటవీ భూములను స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాత సంఘ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వినతిపత్రాన్ని శుక్రవారం సమర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు డిజిటల్ విద్య

నెల్లూరు (టౌన్): వీఆర్ హైస్కూల్లో పేద విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించనున్నామని మంత్రి నారాయణ కుమార్తె షరణి తెలిపారు. వీఆర్ హైస్కూల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు.

బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న హేనాసుజన్

నెల్లూరు (పొగతోట): మహిళలు, బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఆదేశించారు. నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పీడీగా బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. అనంతరం సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని కోరారు. లోటుపాట్లు జరిగితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బడిఈడు పిల్లలతో పనులు చేయించే వారిపై చర్యలు చేపడతామని చెప్పారు. బాలల సంరక్షణాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నకుమార్‌రెడ్డికి పరామర్శ



నెల్లూరు సిటీ: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల చేతికి శస్త్రచికిత్స చేయించుకున్న క్రమంలో ఆయన్ను కలిశారు.

విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమ జయప్రదానికి పిలుపు



నెల్లూరు(బృందావనం): హరనాథపురం సమీపంలోని ఫ్లయ్‌ఓవర్ వద్ద ఆదివారం నిర్వహించనున్న మాజీ మంత్రి ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘీయులు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు కోరారు. స్టోన్‌హౌస్‌పేటలోని నెల్లూరు డిస్ట్రిక్ట్ రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో వివిధ వాణిజ్య సంఘాలు, అసోసియేషన్ల నేతలు, నిర్వాహకులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆనం రంగమయూర్‌రెడ్డిని సత్కరించారు. జొన్నలగడ్డ మోహన్‌రావు, ఆంజనేయులు, శేషారావు, భవనాసి సురేష్, లక్ష్మీనారాయణ, కోట సత్యనారాయణ, సోమిశెట్టి రమేష్, శేఖర్‌బాబు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేస్తే జరిమానా



సూచనలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలో ఇంటింటికీ వచ్చే చెత్త సేకరణ వాహనాలకే వ్యర్థాలను అందించాలని, అలా కాకుండా బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తప్పవని కమిషనర్ నందన్ స్పష్టం చేశారు. నగరంలోని 36వ డివిజన్ ఫతేఖాన్‌పేట తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

• సచివాలయాల పరిధిలో నూతన భవన నిర్మాణాలు జరిగేందుకు ప్లానింగ్ కార్యదర్శులు పూర్తి స్థాయిలో సహకరించాలని కమిషనర్ నందన్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనాలకు చార్జిషీట్లను దాఖలు చేయాలని ఆదేశించారు. అనధికార లేఅవుట్లను నిర్మాణ స్థాయిలోనే గుర్తించి, అనుమతుల్లేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన సమస్యలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించాలని పేర్కొన్నారు. సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ నరేంద్ర, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..





నెల్లూరు(బృందావనం): నగరంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారిని రాష్ట్ర ఫైర్ సర్వీస్ డైరెక్టర్ మురళీమోహన్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వేదపండితులు, అర్చకులు వీరికి స్వాగతం పలికారు. ఖడ్గమాల పూజలు జరిపిన అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

• రాహుకాల ఉద్యాపన పూజలకు 21 మంది హాజరయ్యారు. రాహుకాల దీపాలను వెలిగించారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకిసేవను విశేషంగా నిర్వహించారు.

ప్లాస్టిక్ కవర్లలో ఆహార పదార్థాలివ్వొద్దు



ఫ్లయ్‌ఓవర్ వద్ద రోడ్లను శుభ్రపర్చే విధానాన్ని పర్యవేక్షించారు.

నెల్లూరు(బారకాసు): ప్లాస్టిక్ కవర్లలో ఆహార పదార్థాలను ఇస్తే చర్యలు తప్పవని ఎంహెచ్‌ఓ చైతన్య స్పష్టం చేశారు. నగరంలోని 17వ డివిజన్లో గల ఆకుతోట సచివాలయ ప్రాంతంలో పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నారాయణ మెడికల్ కళాశాల సమీపంలోని ఫుడ్ ట్రక్ వద్దకెళ్లి పర్యవేక్షించారు. ఆహార నిల్వలను సరైన పద్ధతిలో పడేయకపోవడం, పాలిథిన్ కవర్ల వాడకాన్ని పరిశీలించిన ఆయన దుకాణదారులను హెచ్చరించారు. రామలింగాపురం

సుధాకర్ ఎన్‌కౌంటర్ బూటకం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌పై జరిపిన ఎన్‌కౌంటర్ బూటకమని పౌరహక్కుల సంఘ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు అంకయ్య ఆరోపించారు. ఈ మేరకు ఒక ప్రకటనను శుక్రవారం విడుదల చేశారు.

డీఎస్సీ పరీక్షలు షురూ..

డీఎస్సీ పరీక్షలు జిల్లాలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొత్తం ఐదు కేంద్రాల్లో పరీక్షను ఆన్‌లైన్లో నిర్వహించారు. ఎండ తీవ్రతతో అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయాన్ని కల్పించడాన్ని విస్మరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





పరీక్ష రాసి వస్తున్న దివ్యాంగులు





చివరి నిమిషంలోనూ సన్నద్ధమవుతూ..



ఎండ తీవ్రతకు అవస్థ పడుతూ..